"ఇది మీకు తగదు." అని బ్రతిమాలుకుంది, విమల.

పిల్లలున్నారు. వాళ్ళని చూసయినా, వాళ్ళ కోసమయినా మీ ప్రవర్తన మార్చుకోవాలి– అని ఎన్నో విధాల చెప్పి చూసింది. అలిగి కోపం ప్రకటించింది. చేతులు పట్టుకుని బ్రతిమాలు కుంది.

ఆ విషయాలన్నీ తెలిసి సుందరం విశాఖపట్నం నుండి పని గట్టుకొని వచ్చాడు. సుందరం కనకారావు గారి అబ్బాయి. స్టీలు ప్లాంటులో ఇంజనీర్‌గా వుద్యోగం చేస్తున్నాడు. ఉన్నదున్నట్టు కుండ బ్రద్దలు కొట్టి మాట్లాడుతాడు. దాపరికం లేని మనిషి. ఏంట్రా బావా! ఇది?" అని సూర్యాన్ని నిలదీసి అడిగాడు. "ఏ సంగతి నువ్వు మాట్లాడేది? ఏంటి అసలు సంగతి?"– అతనికేం తెలీదనుకుని ఎదురు ప్రశ్న వేసాడు సూర్యం, నవ్వి. "రాస్కెల్! ఇంత గొడవా చేస్తూ, ఏం జరగనట్టు నటిస్తావా? నీకు బుర్రా బుద్ధి వుందా? నువ్వు మనిషివేనా? ఛి... ఛీ. పైగా ఆ నవ్వు ఒకటా? ఒరే, ఒకసారి చెడగొట్టుకున్నాక తిరిగి పరువు ప్రతిష్టల్ని సంపాదించు కొనటం చాలా కష్టంరా. నీలో చీమూ నెత్తురూ వుంటే ఇక మరలా అలాగ ప్రవర్తించవురా"– అని పరుషంగా మాట్లాడాడు సుందరం. మొహం ఎర్రగా చేసుకుని తల దించుకున్నాడు సూర్యం.

"అమ్మాయ్! నేనలా వూర్లోకి వెళ్ళి మా ఫ్రెండుని కలిసి వస్తాను." అని సుందరం అలా వెళ్ళగానే–

"ఏమిటే! ఏమిటీ న్యూసెన్సు? నా ఇంటికి వచ్చి, నాతో ఇలా వెధవలాగ మాట్లాడటానికి అసలు వాడెవడూ?" అని ఎగిరి పడ్డాడు సూర్యం.

"అయిన అల్లరి చాలు. ఇక వూరుకోండి" అంది విమల. కోపంతో పిచ్చెక్కినట్టు అయి, మీదపడి జుట్టు పట్టుకున్నాడు.

"జాగ్రత్త! వదలండి. ఇక నుంచి ఇలాటి పన్లు చేస్తే సహించేది లేదు!"

"సహించక ఏం చేస్తావే! కొత్తగా కొమ్ములు వచ్చాయా? ఏం చూసుకునే ఆ పొగరూ?" అని, లాగి

# విసర్జనం

వంగదీసి గొడ్డును బాదినట్టు బాదాడు సూర్యం.

"మీరు మనుషులా? పశువులా? అవతలికి, పొండి. నన్ను వదలండి."

"అవునే! నీ కంటికి నేను పశువులాగా కన్పిస్తున్నానా! ఎంత కండకావరమే నీకూ?"– అని ఎముకలు విరిగేటట్టు కుమ్మి, కసితీరక, చేతికి అందిన కర్ర తీసుకుని నెత్తి మీద బలంగా కొట్టి –

నెత్తుటి మడుగులో స్పృహ కోల్పోయి పడిపోయిన, విమలని వదిలేసి పారి పోయాడు సూర్యం.

స్నేహితుడ్ని కలిసి మాట్లాడుకుని, ఒక గంట తర్వాత సుందరం వచ్చేసరికి ఇంకా అదే స్థితిలో వుంది విమల. ఆ దృశ్యం చూసే సరికి సుందరం కడుపు చెరువయింది. వెంటనే విమలని హాస్పిటల్‌లో చేర్చి, కాకినాడకి ఫోను చేసి తండ్రితో మాట్లాడేడు సుందరం. ఆయన సలహా మీద–

ఆఫీసుకి విమలతో సెలవు పెట్టించి, వెంటనే– కాస్త నయం కాగానే– విమలనీ, పిల్లల్నీ తీసుకుని విశాఖపట్నం వెళ్ళాడు. ఆ సమయానికి కనకారావు గారు కూడా విశాఖపట్నం చేరారు.

అక్కడ నెల రోజులున్నాక, సుందరం వత్తిడి చేయగా విడాకులకి కోర్టులో దావా వేయటానికని కాకినాడ చేరుకుని వెంటనే ఆ పని చేసారు.

సూర్యం ప్రవర్తన భరించ లేనంతగా వున్నట్టు ఋజువయిందనీ– అందువలన విమల కోరుకున్నట్టుగా విడాకులు మంజూరు చేయటాన్కి తనకి అభ్యంతరం లేదనీ– అయితే ఇది భార్యాభర్తలకి సంబంధించిన వ్యవహారం కనుకా ఇందులో సున్నితమయిన ఇతర అంశాలు ఇమిడి వుండటం వల్లనా– ఆలోచించు కొనటానికి, అవసర మనుకుంటే రాజీకి రావటానికి కొంత సమయం ఇస్తున్నాననీ జడ్జిగారు తీర్పు ఇచ్చారు.

ఎర్రబడిన కనులతో రేగిన జుట్టుతో, లొతుకు పోయిన చంపలతో– తల వంచుకుని తీర్పుని ఆలకించిన సూర్యం నిశ్శబ్దంగా వుండిపోయాడు.

కనకారావు పలకరించినా బదులు పలక లేదు.

ఆ తర్వాత నాలుగు రోజులకే– కనకారావు గారికి విజయవాడ నుండి టెలిగ్రాం వచ్చింది.

త్రాగి, స్పృహ కోల్పోయి, స్కూటరు గుద్దుకొనగా హాస్పటల్ పాలయిన సూర్యం ఎవరో ఫ్రెండ్‌తో ఆ టెలిగ్రాం ఇప్పించాడు.

దిక్కులేని పక్షిలాగా అయిన సూర్యం మీద జాలిపడి అక్కడే భార్యా సమేతంగా వుండిపోయారు కనకారావు గారు. ఆయన అక్కడ నుంచే విమలకి నాలుగు వుత్తరాలు రాసారు.

ఉద్యోగానికి యాంత్రికంగా వెళ్ళి వస్తూ వున్నా, ఆ వుత్తరాలు విమలని కుదిపి వేసాయి. ఆ తర్వాత సూర్యం కోలుకొన్నాక, అతన్ని తీసుకుని కాకినాడ వెళ్ళాక కూడా ఆ విషయం గురించే– మరి రెండు వుత్తరాలు రాసారు కనకారావు గారు.

ఇది మూడోది, ఆఖరిది....

మనిషి మనసు కోతి వంటిది. ఆ మనసు కోతి అలవాటుకి బానిస. స్వార్థం పశుత్వం నిండిన – కోతి మనసు సరిగావటం సంభవంకాని సంగతి. ఎలుక తోకని వుతికి తెల్లబరచ బూనటం, కుక్కతోక వంకరని లాగి సరి చేయబోవటం– రిజల్టురాని అవకతవక పనులు. ఆశపడి పిచ్చి పరుగులు తీసి భంగపడటమే, నిరాశ ఎదురయిందని క్రుంగి కన్నీరు కార్చటమే– మిగులుతుందని తెల్సినపుడు– కొన్ని కాలం చెల్లిన సామాజిక పద్ధతుల్ని పట్టుకుని వ్రేలాడి, తిరిగి ఆ నరకాన్ని పీడననీ కావాలని వరించటం ఏం తెలివిగలతనం?

పోయింది పోల్చు.

అందని సంసార సుఖాన్ని గురించి బాధపడటం అనవసరం.

దుష్టాంగంబున్ ఖండించి విసర్జించటమే మేలు– అన్నారు.

పిల్లల్ని శ్రద్ధగా పెంచి, వాళ్ళని ప్రయోజకుల్ని చేసుకోవటమే ఇక మిగిలి వున్న కర్తవ్యం. తల్లిగా ఆ బాధ్యత తనకి వుంది.

ఒక భార్యగా సుఖ సంసారం చేసుకునే ప్రాప్తం తనకి లేదు.

నేలపాలయిన పాలని గురించి వగచి ప్రయోజనం లేదు.

ఏడ్చి, ఏడ్చి కన్నీరు కార్చిన చంపల్ని తుడుచుకుని– మొహం కడుక్కునింది విమల.

వెంటనే, తయారయి టెలిగ్రాఫ్ ఆఫీసుకి వెళ్ళి కాకినాడకి కనకారావు గార్కి టెలిగ్రాం ఇచ్చింది.

"నేను మరల ఈ జన్మలో సూర్యాన్ని చూడాలని కోరుకోను. కనుక ఈ పని మీద మీరు అతన్ని తీసుకుని ఇక్కడికి బయలుదేరి రావద్దు. నేను బాగా ఆలోచించుకుని ఈ నిర్ణయం తీసుకున్నాను. మానవతి, అభిమానవతి అయిన యువతిగా నా నిర్ణయం యొక్క మంచి చెడ్డల్ని నేనే ఎదుర్కొనటాన్కి సిద్ధపడ్డాను. నా నిర్ణయం మీ మనసుకి ఏమయినా కష్టం కలిగించి వుంటే నన్ను క్షమించండి – విమల."

ఆ పనిచేసి ఇల్లు చేరిన విమలకి గుండెల మీద నుండి కొండంత బరువు దింపినట్టు హాయిగా అన్పించింది. □

